మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 124 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 01 ఏప్రిల్ 2026 | పేజీలు : 4





ఉచిత బస్సుతో మహిళలకు మేలు 3



# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- అంగన్‌వాడీలు, స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన సందీప్ కుమార్ ఝా 2 లో



### 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా

# గ్రామసభలు

## కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన

## కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు, వార్డు సభలను కచ్చితంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన` ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర బడ్జెట్ లో ప్రకటించిన కొత్త పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సభల సందర్భంగా లబ్దిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఫీల్డ్ స్థాయిలో అమలు, ప్రజల భాగస్వామ్యం, విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సిఎస్ పునరుద్ఘాటించారు. కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు.అనంతరం ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభలలో అనుసరించాల్సిన కార్యకలాపాల క్రమాన్ని కలెక్టర్లకు వివరించారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఒకే విధంగా, సమర్థవంతంగా జరగేందుకు నిర్మిత అజెండాను ఆయన వివరించారు. కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ / అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వార్డు సభల సందర్భంగా 100 శాతం పన్ను వసూళ్లు సాధించిన మున్సిపల్ సిబ్బందిని సత్కరించాలని సూచించారు. ఇది పట్టణ పాలనలో ఉత్తమ పనితీరును గుర్తించి ప్రోత్సహించడానికి చేపట్టిన చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు ప్రసంగిస్తూ ఏప్రిల్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హెల్త్ వీక్ గురించి కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.






# జనగామ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం అమలు వంటి అంశాలను పర్యవేక్షించారు. అలాగే కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి, వారి చదువు స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహన గురించి పలు ప్రశ్నలు వేసి పరీక్షించారు. మధ్యాహ్న భోజనం అమలుపై మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ఆహార నాణ్యత, వంట విధానం, వంటశాల, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలల్లో అన్ని సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలో గల సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేపట్టారు.ఈ క్రమంలో సఖి కేంద్రంలో బాధిత మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలపై కలెక్టర్ ఆరా తీశారు.సేవలు సమయానికి, సమర్థవంతంగా అందుతున్నాయా? సఖి కేంద్రానికి ఎలాంటి కేసులు వస్తున్నాయి? వచ్చిన కేసులకు ఎలా కౌన్సిలింగ్ ఇస్తున్నారు? అని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సఖి కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించే విధంగా సిబ్బంది పని చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఎన్నికలల్లో ఓడిన స్థానాలపై సమీక్ష

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంతో పాటు రాయపర్తి మండలం తిరుమలయపల్లి, ఎర్రకుంటా తండా గ్రామాలలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి చెందిన అంశంపై టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేశారు. ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఓటమి కారణాలను లోతుగా విశ్లేషించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంపొందించడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలతో మరింత దగ్గరగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.

## వరంగల్ బస్టాండ్‌లో మహాలక్ష్మి సంబరాలు

**వరంగల్, మన చౌరాస్తా :** మహాలక్ష్మి పథకం ద్వారా మహిళా ప్రయాణికులు రూ.10వేల కోట్లు ఆదా చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ బస్టాండ్ లో సంబరాలు నిర్వహించారు. హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొని మాట్లాడుతూ వరంగల్ జిల్లా మహిళలు 6 కోట్ల ప్రయాణాలు చేసి రూ.275 కోట్లు ఆదా చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ కూడా రూ. 200 కోట్లతో ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించాను. ప్రతి పథకంలో మహిళలకు ప్రభుత్వం భాగస్వామ్యం చేస్తూ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించి వారి ఆర్థిక సమృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా బస్సులలో ప్రయాణం చేసి నగదు ఆదా చేసుకున్న వివిధ విభాగాలు చెందిన ఐదుగురు మహిళలను సన్మానించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డి ఆర్ డి ఓ పి డి రాంరెడ్డి, డీ ఆర్ ఓ విజయలక్ష్మి వరంగల్ తహసిల్దార్ టి శ్రీకాంత్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ‘భట్టి’ పద్దులో మౌలిక ‘మార్పు’ ఏది?



**‘మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి’** అనే నినాదంతో పదేండ్ల విధ్వంసకర పాలన నుంచి తెలంగాణకు విముక్తి ‘హస్తం పార్టీ’తో సాధ్యమని నాడు కాంగ్రెస్ లీడర్లు బలమైన ప్రచారం చేశారు. జనం సైతం ‘చేతి’లో చేయి వేసి కాంగి‘రేసు’ను ముందు వరుసలో ఎన్నికల రణరంగంలో నిలిపి రేవంత్ నాయకత్వంలోని మూడు రంగుల జెండాకు మద్దతు తెలిపారు. 2023 డిసెంబరులో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. ప్రజాప్రభుత్వంలో తమకు కావాలిసిన మార్పు వ్యవస్థలో, విధానాల్లో సాధ్యమయి మంచి చేస్తాడనే ప్రజల ఆశలు అడియాసలుగానే ఉంటున్నాయి. ప్రజాప్రభుత్వమని పేర్కొనే బడ్జెట్ లో 27 నెలల పాలనలో మౌలికమైన మార్పు కనపిస్తలేదు. గత సర్కారు మాదిరిగానే ‘బంగారు తెలంగాణ’ను చేస్తామంటూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ.. ‘కొత్త సీసాలో పాత సారా’ అన్నట్లుగానే ఆచరణలో ప్రభుత్వ తీరు ఉన్నది. పద్దు రూపలకల్పనలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించడం లేదు. కనీసం జనబాహుళ్యం భాగస్వామ్యం ఉండేలా పద్దు రూపకల్పన చేయడం లేదు. కేవలం అధికారులతో మాత్రమే కూర్చొని నామమాత్రంగా బడ్జెట్ లెక్కల పెంపు జరిగినట్లు స్పష్టమౌతున్నది. ఆర్థిక మంత్రి పద్దు లెక్కల డొక్కలలోకి వెళ్లడం, అంకెల గారడీ చేయడమే తప్ప మౌలికంగా జనం, నిపుణల భాగస్వామ్యానికి చోటు కల్పించేలా చొరవ కనీసంగా అయినా కనిపించడం లేదు.

### నాటి మాటలు నీటి మూటలే..

నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాటలు, నేడు ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ‘ఆదాయం పెంచి ప్రజలకు పంచుతాం.. అప్పులు అడ్డగోలుగా చేయబోం’ అని బీరాలకు పోయిన కాంగ్రెస్ నాయకుడు నేడు సభా నాయకుడిగా చట్ట సభల సాక్షిగా అప్పుల గురించి చెబుతున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు గత ప్రభుత్వ పదేండ్ల కాలంలో గల్లంతు అయిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం కనీసంగా యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు సంబంధించిన పద్దులో కేటాయింపులు ఆచరణలో యువ‘తెలంగాణం’ పరిఢవిల్లేలా అంతగా ఆసక్తి చూపినట్టు కనిపించడం లేదు. గత పాలకుల మాదిరిగానే ఆదాయ అన్వేషణ మార్గాలను మాత్రం అన్వేషిస్తూ.. ఎక్సయిజ్ ద్వారా డబ్బు వస్తుందనే సూత్రీకరణనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుత యుద్ధ ప్రభావం నేపథ్యంలో చమురు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ యువతపై ఏఐ ప్రభావం వంటి నిజమైన చర్చనీయాంశాలను సైతం కనీసంగా పద్దు ప్రతిపాదనల సందర్భంలో ఎక్కడా వెల్లడించలేదు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపైన ఏ మాత్రం వివరణ లేదు. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ, ఆరోగ్యశ్రీలో లిమిట్ పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు మరి కొన్ని తప్ప మిగతా కీలకమైన హామీలకు పద్దులో కేటాయింపుల్లేవు. మహిళలకు ప్రతీ నెలా రూ.2,500(మహాలక్ష్మి స్కీం కింద), విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారంతో పాటు బోలెడన్ని హామీలు నీటిమూటలేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు పెద్దలకు వీటన్నింటి కంటే కూడా ఫక్తు రాజకీయంపైనే ఫుల్ ఫోకస్ చేస్తున్నారు. 24 గంటలు లాబీయింగ్.. ఢిల్లీ అధిష్టానానికి కంప్లయింట్స్, మంత్రుల వద్ద పైరవీలు, రాజకీయంపైనే సర్కారులోని కీలక వ్యక్తులు ప్రయారిటీ ఇస్తున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ‘మార్పు’ అనేది కేవలం అధికారంలోని పార్టీ మాత్రమేననే అభిప్రాయం జనబాహుళ్యం నుంచి వ్యక్తం అవుతున్నది. బడ్జెట్ ప్రతులలోని అక్షరాలు సైతం గత సర్కారు హయంలో మాదిరిగానే అవే పడికట్టు పదాలతో ఉండటం గమనార్హం. నిజంగా క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులు, యువత ముఖ్యంగా నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు, పన్నెండేండ్ల తెలంగాణలో సాధించుకోలేకపోతున్న అంశాలపైన నిపుణులు, అన్ని రంగాలకు చెందిన ప్రముఖులతో ప్రభుత్వం చర్చలు జరిపి.. వాటన్నింటి సారాన్ని వడపోసి పద్దులో కేటాయింపులు చేసినప్పుడు ప్రజలకు సంబంధించిన పనులకు అడుగులు పడతాయి. అప్పుడు మాత్రమే ప్రజా ప్రభుత్వం అని ప్రస్తుత సర్కారు చెప్పుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ఇప్పటికైనా ప్రస్తుత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆశిద్దాం.. కోరుదాం.. డిమాండ్ చేద్దాం..



- లింగబత్తిని కృష్ణ, జర్నలిస్ట్,
సెల్ : 9701923260

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

- పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
- ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతి రోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.



# మూడు దశాబ్దాల సేవలకు ముగింపు


### ఆర్టీసీ డ్రైవర్ చక్రపాణికి ఘన వీడ్కోలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల చక్రపాణి, టీఎస్‌ఆర్టీసీ డ్రైవర్‌గా మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. హుస్నాబాద్ డిపోలో ఆర్టీసీ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సహోద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకన్న మాట్లాడుతూ, 1996లో ఉద్యోగంలో చేరిన చక్రపాణి, 30 సంవత్సరాల పాటు ఒకే డిపోలో క్రమశిక్షణతో సేవలందించారని తెలిపారు. ఉత్తమ డ్రైవర్‌గా 12 సార్లు అవార్డులు అందుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా విశ్రాంతి జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గందరగోళంగా బడ్జెట్ సమావేశం

- వైస్ చైర్మన్‌కు అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాకౌట్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం వివాదాస్పదంగా మారింది. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం , ప్రొటోకాల్ ఉల్లంఘన ఆరోపణలతో సభలో తీవ్ర నిరసన వ్యక్తమైంది.ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం:మున్సిపల్ బడ్జెట్ వంటి కీలక సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌కు స్టేజీపై కనీస సీటు కేటాయించకపోవడంపై కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఉడుగుల కిష్టయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్లు సభలో నిరసనకు దిగారు. ఇది వైస్ చైర్మన్ పదవిని మరియు కౌన్సిల్ మర్యాదను కించపరచడమేనని వారు ఆరోపించారు.సభ నుండి వాకౌట్ - మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా : అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి సభ నుండి వాకౌట్ చేశారు. అనంతరం కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. మున్సిపాలిటీలో నియంతృత్వ ధోరణి నడుస్తోందని, ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కుతున్నారని వారు విమర్శించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం మరియు ప్రొటోకాల్ పాటించాలని, వైస్ చైర్మన్‌కు జరిగిన అవమానానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# తెలంగాణలో ఒక్కసారిగా మారిన వాతావరణం

### పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని సూచన

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎండలు, వర్షాలతో కూడిన భిన్నమైన వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. హైదరాబాద్ లో వర్షం అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం, బి.ఎన్.రెడ్డి నగర్, మీర్‌పేట్, బాలాపూర్, చంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, సరూర్ నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, ఉప్పల్,నాగోల్ ఏరియాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 31న ఉదయం నుంచే కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజాంబాద్, కరీంనగర్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటిపూట కూడా చీకట్లు అలుముకున్నాయి. రాబోయే 4 రోజుల పాటు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగనుంది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోయినా గాలిలో తేమ పెరగనుంది. అయితే ఈ అకాల వర్షాలు అన్నదాతలకు కన్నీరు మిగిలిస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి పంట ఈదురు గాలుల వల్ల నేలపాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు చోట్ల మామిడి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



# ఘనంగా వీర హనుమాన్ విజయ శోభాయాత్ర

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని భీమదేవరపల్లి మండలంలో వీర హనుమాన్ విజయ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. టీటీడీఎస్ (త్రికూటేశ్వర ఆలయ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ, ముత్తారం) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఈ శోభాయాత్ర గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. కొత్తపల్లి శ్రీ దత్త సాయి క్షేత్రం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర, ముల్కనూర్ బస్టాండ్ మీదుగా ముత్తారం త్రికూటేశ్వర ఆలయం వరకు అంగరంగ వైభవంగా సాగింది. హనుమంతుడి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. మార్గమంతా భక్తి గీతాలు, డప్పు వాయిద్యాల నడుమ యాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది. శోభాయాత్రలో పాల్గొన్న యువత కాషాయ జెండాలు పట్టుకుని "జై శ్రీరామ్", "జై జై హనుమాన్" అంటూ నినాదాలు చేస్తూ భక్తి పరవశంలో మునిగిపోయారు. కొందరు హనుమాన్ వేషధారణలో ఆకట్టుకోగా, భక్తులు నృత్యాలు చేస్తూ యాత్రను మరింత వైభవంగా మార్చారు. మహిళలు మార్గమధ్యంలో హారతులు ఇచ్చి స్వామివారికి ఘన స్వాగతం పలికారు. చైత్ర మాస శుక్ల పక్ష పౌర్ణమి సందర్భంగా హనుమాన్ జయంతి వేడుకల భాగంగా ఈ విజయ శోభాయాత్రను నిర్వహించినట్లు టీటీడీఎస్ సభ్యులు తెలిపారు. హనుమాన్ స్వామి కృపతో గ్రామంలో శాంతి, ఐశ్వర్యం నెలకొనాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీటీడీఎస్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వరుస సినిమాలో

# ప్రభాస్ బిజీ

ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార', 'కల్కి 2898', 'ఆదిపురుష' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**